క్లుప్తంగా

త్వరలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన జగనన్న ఇళ్ల పట్టాలను త్వరలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరలో ప్రారంభిస్తామని డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న ఆదివారం తెలిపారు. మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాలలో 1,015 మందికి ఇళ్లస్థలాలు కేటాయించి పట్టాలు కూడా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. అయితే కొన్ని సాంకేతిక లోపాల కారణంగా మండలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు కాలేదన్నారు. సాంకేతిక లోపాలు తొలగిన వెంటనే ప్రక్రియ మొదలుపెట్టి పూర్తిచేస్తామని చెప్పారు.

శ్రీశైలంలో భారీ కొండచిలువ



కొండచిలువను అడవిలోకి వదులుతున్న దృశ్యం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని దేవస్థానం చండీశ్వర సదన్ అతిథి గృహం సమీపం నుంచి స్టాఫ్ క్వార్టర్స్ దగ్గర ఉన్న బాలగణేష్ వనంలోకి వెళ్తున్న భారీ కొండచిలువను శనివారం అర్ధ రాత్రి పట్టుకున్నారు. కొండచిలువ రోడ్డు దాటుతున్న సమయంలో యాత్రికులు గమనించి స్థానికులకు చూపించడంతో పాములను పట్టుకోవడంలో నైపుణ్యం కలిగిన స్నేక్‌రాజా అక్కడికి చేరుకొని దానిని పట్టుకున్నాడు. అనంతరం 9అడుగుల కొండచిలువను మల్లమ్మ కన్నీరు ఆలయ సమీపంలో అడవిలో వదిలారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న ఎస్‌ఐ అశోక్

పాములపాడు: రాబోవు ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల డీఎస్పీ శ్రీనివాసరావు వేంపెంట గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా రాత్రి బస చేశారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకోవాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. అల్లర్లకు పాల్పడే వారెవరైనా ఉపేక్షించేది లేదన్నారు. అనవసర గొడవల్లోకి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రజలకు హితవు పలికారు.

ముఖ్య అర్చకుడికి పదోన్నతి

మహానంది: మహానంది దేవస్థానంలో ముఖ్య అర్చకుడుగా పని చేస్తున్న మూలస్థానం శంకరయ్య శర్మకు ఉప ప్రధాన అర్చకుడిగా పదోన్నతి కల్పిస్తూ దేవదాయ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయనకు అధికారికంగా ఉత్తర్వులు అందించనున్నారని కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయనకు ఉప ప్రధాన అర్చకుడిగా ఇవ్వడంతో మరో అర్చకుడికి ముఖ్య అర్చకుడిగా పదోన్నతి కలిగే అవకాశం వచ్చినట్లయింది.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నందికొట్కూరు: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం త్రైత సిద్ధాంతం భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. కోరికలు, కర్మలు పూర్తిగా లేకుండా పోతే ఉత్తరాయణం రోజు మోక్షం కలిగి విముక్తి కలుగుతుందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు రామచంద్రుడు, మునిదాసు ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కుమార్, సంజీవ, చక్రపాణి, పార్థసారథి, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సయ్యద్ ఉమర్

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ఉమర్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మండలంలో పని చేస్తున్న ఎంపీడీఓ షేక్ అమానుల్లాను వైఎస్‌ఆర్ జిల్లా బద్వేల్‌కు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో ఉమర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రజతోత్సవ సభలను విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా డీటీఎఫ్ అధ్యక్షులు ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని డీటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. డీటీఎఫ్ నాయకులు రత్నం ఏసుపు, కిషోర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోరాటానికి 'సిద్ధం' కావాలి

- 'సిద్ధం' సభలు సూపర్ సక్సెస్
- జనసునామీని చూసి బెంబేలెత్తుతున్న ప్రతిపక్షాలు
- అనంతపురం సిద్ధం' సభకు భారీగా తరలిరావాలి
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సిద్ధం పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పోరాడేందుకు సిద్ధం కావాలని, ప్రతిపక్ష పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని ఆంధ్రప్రదేశ్ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం మహానంది, బండిఆత్మకూరు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ సిద్ధం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సభలు సూపర్ సక్సెస్ అవుతున్నాయని, హాజరైన జనప్రభంజనాన్ని చూసి ప్రతిపక్ష పార్టీల కళ్లు బైర్లు కమ్ముతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు.

ఒంటరిగా గెలవలేకనే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం

ఒంటరిగా పోటీ చేసి గెలవలేకనే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల మనస్సుల్లో సీఎం జగన్ ఉన్నారని చెప్పడానికి రెండు సభలకు హాజరైన ప్రజాభిమానమే నిదర్శనమన్నారు. అనంతపురంలో ఈ నెల 10న జరిగే సిద్ధం సభకు శ్రీశైలం నియోజకవర్గం నుంచి 200 బస్సుల్లో నాయకులు, పార్టీ శ్రేణులతో వెళ్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే అన్ని మండలాల్లో నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేశామని చెప్పారు. శ్రీశైలం నియోజకవర్గం ఎప్పటికీ సీఎం జగన్ వెంటే ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, రెండు మండలాల పార్టీ అధ్యక్షులు కొమ్మ మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాస రెడ్డి, రెండు మండలాల గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా సైనికులు సిద్ధం

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సైనికులు సిద్ధంగా ఉన్నారని ఎమెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు, యువనేత శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. పాండురంగాపురం వద్ద ఆదివారం సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు, ఇన్‌చార్జ్‌లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ సెల్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో సైనికుల్లా ప్రతిపక్షపార్టీల అబద్ధపు ప్రచారాలు, టీడీపీ నేతల అరాచకాలను ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల సోషల్ మీడియా కన్వీనర్లు, ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

సిద్ధం సభకు భారీగా తరలి రావాలి

వెలుగోడు: ఈ నెల 10వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహిస్తున్న సిద్ధం ఎన్నికల శంఖారావ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సిద్ధం సభ పోస్టర్లను ఎమ్మెల్యే విడుదల చేసి, పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల పార్టీ ప్రతినిధులతో అనంతపురంలో నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్దామని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంతో సహా రాయలసీమలోని అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. సిద్ధం సభకు ప్రతి గ్రామం నుంచి కనీసం 100 మంది కార్యకర్తలు హాజరై ప్రతిపక్ష నాయకుల గుండెల్లో గుబులు పుట్టించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, వైస్ ఎంపీపీలు శంకర్ నాయక్, చికెన్ బాబు, సర్పంచ్ జయపాల్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, నాయకులు షంషీర్ అలీ, ఇలియాస్ ఖాన్, ముడిమేల సుధాకర్‌రెడ్డి, తెలుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయోభిలాషి సీఎం జగన్



పంపుసెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ఆత్మకూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల శ్రేయోభిలాషిగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం జలకళలో భాగంగా రైతులకు పంపు సెట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో రైతులకిచ్చిన మాట మేరకు వైఎస్సార్ జలకళ ద్వారా సన్న, చిన్న కారు రైతులకు సుమారు రెండు లక్షల రూపాయల విలువైన బోరుపంపుసెట్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జి.శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజమోహన్‌రెడ్డి, సురేష్, లక్ష్మిరెడ్డి, బాలస్వామి, మౌలాలి, రషీద్ పాల్గొన్నారు.

రెడ్డి నాయక్‌కు పరామర్శ

వెలుగోడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి నాయక్‌ను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం రెడ్డి నాయక్ ఇంటికి వెళ్లిన భువనేశ్వర్‌రెడ్డి ఆయన ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకొని త్వరగా కోలుకోవాలని కోరారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు ఉన్నారు.

మహానందీశ్వరుడి సేవలో ..



మహానందికి వచ్చిన ఏపీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎన్‌బాబు

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో ఏపీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎన్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పూజలు నిర్వహించారు. వారితో పాటు నంద్యాల డీఆర్‌ఓగా పనిచేస్తూ బదిలీ అయిన పుల్లయ్య, నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డిలు వేర్వేరుగా మహానందికి వచ్చారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. వారు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం అలంకార మండపంలో వేద పండితులు వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఉంగరం అప్పగింత

మహానంది: చాగలమర్రికి చెందిన భక్తుడు శ్రీనివాసశర్మ మహానందీశ్వర స్వామి దర్శనార్థం ఆదివారం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానం చేస్తుండగా బంగారు ఉంగరం పడిపోయింది. విషయం తెలుసుకున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న సిబ్బంది చేత వెతికించి బాధితుడికి అప్పగించారు.

చంద్రబాబు మాయలో పడొద్దు

- శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- మారుతీనగర్‌లో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో 35 కుటుంబాలు చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: కల్లిబొల్లి మాటలు, కుట్రలు, కుతంత్రాలతో అధికారంలోకి రావాలని విశ్వప్రయత్నం చేస్తున్న చంద్రబాబు నాయుడు మాయలో పడి మరోసారి మోసపోవద్దని శాప్ రాష్ట్ర చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మారుతీనగర్‌లో కౌన్సిలరు లాలు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ ఆధ్వర్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో గొండబాబు, ప్రకాశం, కరెంట్ రమణ, వంశీ, తిరుపాలు, బాలుగ్రం, నవీన్, రవి, శ్రీరాములు, గోపాల్, రత్నం, రాజు, జేమ్స్‌తో 35 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు దోచుకున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను దగా చేసిన చంద్రబాబును నమ్మితే మళ్లీ మోసం చేయడం ఖాయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. పేద ప్రజలకు మేలు చేసిన చరిత్ర చంద్రబాబుకు లేదన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి ఇస్తామని పచ్చిగా మోసం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. సామాజిక న్యాయం పాటిస్తున్న ఆదర్శవంతుడు సీఎం వైఎస్ జగనన్నే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, ఆర్టీసీ బాబు, బాష, చరణ్, ఏసేపు, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి జగనన్నను మరో మారు సీఎంను చేసుకునేందుకు గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో సైనికుల్లా పనిచేయాలని శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం 80బన్నూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త జావీద్ వివాహ వేడుకలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ హాజరయ్యారు. అనంతరం వారు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నానిరెడ్డి (మద్దిలేటిరెడ్డి), ఎల్లారెడ్డి ఇళ్ల వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తల మధ్య ఎన్ని సమస్యలున్నా వాటిని పక్కన పెట్టి త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకొని అన్నింటిని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు నానిరెడ్డి, ఎల్లారెడ్డి, సామేలు, గంగాధర్‌గౌడు, అంజి, తెలుగుసాంబ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



దారా సుధీర్‌ను సన్మానిస్తున్న సీఎస్‌ఐ టౌన్ చర్చి సంఘం సభ్యులు

నందికొట్కూరు: క్రైస్తవుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దారా సుధీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఎస్‌ఐ టౌన్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాలంటూ రెవరెండ్ చైర్మన్ మైఖేల్ శ్యాంసుందర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దారను సీఎస్‌ఐ టౌన్ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, శాప్ నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్, కౌన్సిలరు రవూఫ్, సీఎస్‌ఐ సంఘం సభ్యులు జాన్ క్రిసోస్టం, జయచంద్ర, అమల్‌రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున అష్టవిధ మహా మంగళ హారతుల సేవల నుంచి శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి దర్శనం ప్రారంభమైంది. సెలవురోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు, శివదీక్షా స్వాములు ఆలయానికి చేరుకున్నారు. ఈ మేరకు వారు శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. శివదీక్షా స్వాములు భజనలు చేస్తూ పూజలు జరిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లు చూపుతున్న ఎస్‌ఐ నాగార్జున

నందికొట్కూరు రూరల్: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకునట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. ఆదివారం అలూరు గ్రామం సమీపంలో బ్రిడ్జిపై రెండు బైకులను తనిఖీ చేశామన్నారు. రెండు బైక్‌లలో తెలంగాణ లిక్కర్ 75 బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వడ్డేరంగన్న, ఈడిగ శివకుమార్‌గౌడ్ అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

26 మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని తలముడిపి గ్రామానికి చెందిన లక్ష్మన్న గౌడ్ నుంచి 26 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ ఆదివారం తెలిపారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

మండలకేంద్రమైన మిడుతూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని రూ. 3500 నగదును, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సెలవు రోజు కూడా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



పారుమంచాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్

జూపాడుబంగ్లా: కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సెలవురోజైన ఆదివారం కూడా జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగింది. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్ పర్యవేక్షించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 11 జగనన్న కాలనీల్లో 1,432 మందికి ఇళ్లస్థలాలు కేటాయించగా వారిలో ఇప్పటిదాకా 250 మందికి ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ చేసిచ్చినట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు పొందిన లబ్ధిదారులు గ్రామసచివాలయాల వద్దకు వెళ్లి వారికిచ్చిన ఇంటి పట్టా కాగితాన్ని చూపించి వారి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చనని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన పదేళ్ల తర్వాత వారి ఇళ్లపై బ్యాంకు రుణాలు పొందే అవకాశంతో పాటు పదేళ్ల తర్వాత సర్వహక్కులతో క్రయ, విక్రయాలు చేసుకోవచ్చునని తెలిపారు.


టోల్‌గేట్ వద్ద పోలీసుల తనిఖీలు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని దేవస్థానం టోల్‌గెట్ వద్ద ఆదివారం సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ లక్ష్మణరావులు మాట్లాడుతూ వివిధ వాహనాల ద్వారా మద్యం, మాంసం క్షేత్రంలోకి తీసుకొని వస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేసినట్లు తెలిపారు. దేవదాయ, ధర్మదాయ చట్టానికి విరుద్ధంగా క్షేత్ర పరిధిలో మద్యం, మాంసం, గుట్కా, సింగరేట్లు తదితర నిషేధిత వస్తువులు కలిగి ఉన్న వ్యక్తులపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బడ్జెట్ ప్రతుల దహనం

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం రైతుల బడ్జెట్‌ను నిర్లక్ష్యం చేసినందుకు నిరసనగా కురుకుంద గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండలాధ్యక్షుడు మాబాషా ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.47.65లక్షల కోట్ల బడ్జెట్ ప్రకటించగా ఇందులో రైతులకు కేవలం రూ.1.27 లక్షల కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సలీంబాషా, హరికృష్ణ, నాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో స్వచ్ఛ భారత్



ఓంకారంలో దుర్గాశక్తి మహిళా విభాగం సభ్యులు

మహానంది: అన్ని ఆలయాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని హిందూ దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రమేష్ తెలిపారు. బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో ఆదివారం సమితి సభ్యులు పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ఉచిత దర్శనం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం సిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టి.. ఒంటిమిట్టలో జరగనున్న రాములోరి కల్యాణానికి గోటితో వడ్లను వలుస్తూ తలంబ్రాలను సేకరించారు. కేతపల్లి చంద్రశేఖర్, దుర్గా శక్తి మహిళా విభాగం జిల్లా గౌరవ అధ్యక్షురాలు జయలక్ష్మమ్మ, అధ్యక్షురాలు బన్నూరు ఇందిరా దేవి, పట్టణ అధ్యక్షుడు రత్నకల్యాణి పాల్గొన్నారు.

కర్నూలు-మాచర్ల బస్సు సర్వీసు పునరుద్ధరించండి

ఆత్మకూరు: కర్నూలు-మాచర్ల ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, నాగేశ్వరరెడ్డి కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ మాచర్ల, కర్నూలు బస్సు సర్వీసు 20సంవత్సరాలుగా కొనసాగుతుందన్నారు. ఆత్మకూరు, దోర్నాల, మాచర్లకు అధికంగా బంధుత్వం ఉన్నందున బస్సుసర్వీసు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆత్మకూరు నుంచి ప్రయాణికులు దోర్నాలకు వెళ్లి అక్కడి నుంచి మాచర్ల బస్సు ఎక్కాల్సి వస్తోందన్నారు.

దూదేకులు రాజకీయంగా ఎదగాలి

నంద్యాల(వ్యవసాయం): దూదేకులు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని ఏపీ దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్‌మహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వాసవీ హైస్కూల్‌లో నంద్యాల జిల్లా దూదేకుల ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దూదేకుల విద్యార్థులకు విద్యాపరంగా స్కాలర్‌షిప్‌లు పలు అంశాలపై తీర్మానం చేశారు. సంఘం ఉపాధ్యాయ విభాగం రాయచోటి సిద్దయ్య, జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, కన్నయ్య, బాబన్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని బీజేపీ కన్వీనర్ నాగేష్ తెలిపారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆత్మకూరు పట్టణంలోని పల్లెకు పోదాం వర్క్‌షాప్ ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు షబానా, రంగసాయి, సాంబశివగౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న బస్తిపాటి మౌలాలి

జూపాడుబంగ్లా: రజకులు ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో రాణించాలని రజక సంక్షేమ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రజక సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రజకులకు దోబీ ఘాట్లు లేక మురుగునీళ్లలో బట్టలు శుభ్రం చేయలేక చేతివృత్తికి దూరమవుతున్నారని తెలిపారు. కుల వృత్తిపై ఆధారపడిన రజకులు చాలీచాలని (మేర) కూలీడబ్బులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జకులను ఎస్సీజాబితాలో చేర్చి వారికి సముచిత న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రచార కార్యదర్శి నాగభూషణం, ఆహ్వాన కమిటీ మెంబర్ బండ్ల రవి, నాయకులు నడిపి ఎల్లయ్య, నాగేశ్వరరావు, పక్కీరయ్య, పెద్దరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

99 శాతం పింఛన్ల పంపిణీ



వెలుగోడులో లక్ష్మీబాయికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రవితేజ

కొత్తపల్లి: మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ఆదివారానికి 99 శాతం పూర్తి అయ్యిందని సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో 4,337 మంది పింఛన్ దారులు ఉండగా 4వ తేదీ వరకు 4,300 మందికి వలంటీర్లు పంపిణీ చేయడంతో 99 శాతం పూర్తి అయినట్లు చెప్పారు. మిగిలిన ఒక్కశాతం పూర్తిచేస్తామని చెప్పారు.

వెలుగోడు వెళ్లి పింఛన్ పంపిణీ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలం సున్నిపెంటకు చెందిన లక్ష్మీబాయి అనే వితంతు మహిళ అనారోగ్యంతో బాధపడుతూ వెలుగోడులోని బంధువుల వద్ద ఉంటూ వైద్యం చేయించుకుంటోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ రవితేజ ఆదివారం వెలుగోడుకు వెళ్లి లక్ష్మీబాయికి రూ.3,000 సామాజిక పెన్షన్‌ను అందజేశాడు.